



# కరపత్రం

SINCE 2014

శనివారం జనవరి 25 2025 | సంపుటి :0 | సంచిక : 104 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# సిఎం రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం

## ఎయిర్‌పోర్టులో స్వాగతించిన దానం, మల్‌రెడ్డి తదితరులు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు. దుబాయ్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. విమానాశ్రయం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికాయి. ఎమ్మెల్యే దానం నాగేందర్, ఇతర కాంగ్రెస్ నేతలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు కూడా స్వాగతం పలికారు. సింగపూర్, దావోస్ పర్యటనలను విజయవంతం చేసి భారీగా పెట్టుబడులు తీసుకొచ్చారంటూ నేతలు, కార్యకర్తలు కొనియాడారు. దావోస్‌లో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులపై వివిధ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గత పర్యటనలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాగా.. ఈసారి నాలుగు రెట్లు పెరిగాయి. తాజా పెట్టుబడులతో దాదాపుగా 50వేల ఉద్యోగాలు రానున్నాయి. మొత్తం 20 సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సిఎంను కాంగ్రెస్ నేతలు అభినందించారు.



### తెలంగాణ సీఐడీ చేతికి 'కిడ్నీ రాకెట్' కేసు..

## వైద్యారోగ్య శాఖ మంత్రి ఆదేశాలు



2లో

- హైదరాబాద్‌లోని అలకనంద ఆస్పత్రిలో వెలుగు చూసిన 'కిడ్నీ రాకెట్' కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది.
- నగరంలోని అలకనంద ఆస్పత్రిలో వెలుగు చూసిన 'కిడ్నీ రాకెట్' కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది.



## రథసప్తమి రోజు వీఐపీ బ్రేక్ దర్శనాలు.. ఆర్జిత సేవలు రద్దు: తితిదే ఈవో

తిరుమలలో మినీ బ్రహ్మోత్సవాల తరహాలో జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో అదనపు ఈవో, వివిధ విభాగాల అధికారులతో ఈవో సమీక్షించారు. భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, నిష్క్రమణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాలరీలలో ఉండే భక్తులకు సకాలంలో అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

2లో

## కర్పూరి ఠాకూర్ అప్పట్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు: కిషన్‌రెడ్డి

- నగరంలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో భారతరత్న కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


నగరంలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో భారతరత్న కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్పూరి ఠాకూర్ చిత్ర పటం వద్ద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, భాజపా శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డైరీని కిషన్ రెడ్డి ఆవిష్కరించారు.

2లో



## బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు?: హరీశ్‌రావు

- బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.
- తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



- బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

"బనకచర్ల ద్వారా పెన్నా బేసిన్‌కు నీటిని తరలించే ప్రయత్నం ఏపీ ప్రభుత్వం చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అప్పటి ప్రభుత్వం గోదావరి జలాల్లో 968 టీఎంసీలను తెలంగాణకు కేటాయించింది. అదే గోదావరి బేసిన్‌లో తెలంగాణలోని సీతమ్మసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్, సమ్మక్క సాగర్ ప్రాజెక్టు, కాళేశ్వరం మూడో టీఎంసీ, డాక్టర్ అంబేడ్కర్ వార్ధా ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పెండింగ్‌లో ఉన్నాయి. బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సలహాదారు ఏం చేస్తున్నారు? బనకచర్ల ప్రాజెక్టు ఆపాలని ఏపీ ప్రభుత్వానికి కనీసం లేఖ కూడా రాయలేదు. ఆ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారు. చంద్రబాబు లేఖపై కేంద్రంలో దస్త్రం కదులుతోంది. రేపోమాపో ఏడీబీ నుంచి ఏపీ ప్రాజెక్టులకు నిధులు వస్తాయి.

2లో


## నల్గొండ జిల్లా మంత్రికి దోచుకోవడం, దాచుకోవడమే సరిపోతుంది.. జగదీశ్ రెడ్డి ఎద్దేవా

- నల్గొండ జిల్లా మంత్రికి దోచుకోవడం, దాచుకోవడమే సరిపోతుంది.. జగదీశ్ రెడ్డి ఎద్దేవా



## కేపీహెచ్‌బీలో ఖాళీ ప్లాట్లకు ముగిసిన వేలం.. గజం రూ.1.85లక్షలు

- కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పశ్చిమ డివిజన్ పరిధిలోని ఖాళీ ప్లాట్ల వేలం పాట శుక్రవారం సాయంత్రం ముగిసింది.



2లో

## కొత్త కంపెనీల సంగతి దేవుడెరుగు..

### ఉన్న కంపెనీలు పోకుండా చూడండి! : కేటీఆర్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ చదివిన పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉండాలనే ఉద్దేశంతో.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐటీ కంపెనీల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికే ఐటీ కంపెనీలను పరిమితం చేయకుండా.. ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించింది. అలా వేల మంది ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వం.

2లో



# రథసప్తమి రోజు వీఐపీ బ్రేక్ దర్శనాలు..
# ఆర్జిత సేవలు రద్దు: తితిదే ఈవో

మొదటి పేజీ తరువాయి

అనంతరం.. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అధికారులతో కలిసి తిరుమల మాడవీధుల్లో ఏర్పాట్లను ఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. "శ్రీవారి ఉత్సవాల్లో రథసప్తమి అత్యంత ముఖ్యమైనది. ఏటా శుక్లపక్ష సప్తమి తిథిలో సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో రథసప్తమిని వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. వేడుకల్లో భాగంగా స్వామివారు సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఫిబ్రవరి 4న ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహన సేవతో రథసప్తమి వేడుకలు ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి చంద్రప్రభ వాహనసేవతో శ్రీమలయప్పస్వామివారి వాహన సేవలు ముగుస్తాయి" అని ఈవో తెలిపారు.

**భక్తులకు తితిదే సూచనలు...**

రథసప్తమి సందర్భంగా పలు సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు

అష్టాదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలు రద్దు

ఎన్‌ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల ప్రివిలేజ్ దర్శనాలు రద్దు

తిరుపతిలో ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ చేయడం లేదు

ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు. బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఫిబ్రవరి 3న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదు

ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 దర్శనం) టోకెన్లు ఉన్న భక్తులు వేచి ఉండకుండా ఉండేందుకు నిర్ణీత సమయంలో మాత్రమే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద రిపోర్టు చేయాలి

శ్రీవారి వాహనసేవల వివరాలు..

ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు - సూర్యప్రభ వాహన సేవ

ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు - చిన్నశేష వాహన సేవ

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు - గరుడ వాహన సేవ

మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు - హనుమంత వాహన సేవ

మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు - చక్రస్నానం

సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు - కల్పవృక్ష వాహన సేవ

సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు - సర్వభూపాల వాహన సేవ

రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకు - చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

# సంపాదకీయం

## ప్రపంచ ప్రయాణం 19వ శతాబ్దంలోకి..?

మనుషుల సంతోషాన్ని విస్తృతపరుస్తూ సమాజం ముందుకే వెళుతుందని మనం నమ్ముతాం. మొన్నటికంటే నిన్న మిన్నగా.. నిన్నటి కంటే నేడు ఘనంగా.. నేటి కంటే రేపు మరింత అద్భుతంగా ఉంటుందంటూ రెండుమూడు వందలేళ్లల్లో చాలా రచనలు వచ్చాయి. ఆశలు లేకపోతే అడుగులే పడవు. భవితకు భరోసా కనపడకపోతే మన ప్రయత్నాల్లో ఊపూ ఉత్సాహం ఉండదు. సుదీర్ఘ కాలప్రవాహంలో సమాజం ముందుకు నడవటం నిజం! స్థూలంగా చరిత్ర చెప్పేది ఇదే! కానీ వెనుకంజ లేని సమాజమూ జీవితమూ ఉండవు. ఆ వెనుకంజ ఒక్కోసారి భయం కొల్పుతుంది. గతాన్ని నెత్తిమీదకు తెచ్చిపెడుతుంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ గెలిచిన నాటి నుంచి ఒక వెనుకంజ గురించి తరచూ వినపడుతోంది. అంతర్జాతీయ వ్యవహారాల వ్యాఖ్యాత, ప్రముఖ పాత్రికేయుడైన ఫరీద్ జకారియా ఇటీవల తన 'గ్లోబల్ పబ్లిక్ స్క్వేర్' టీవీ కార్యక్రమంలో ట్రంప్ విజయంతో 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదపు (ఇంపిరియలిజం) పోకడలు మళ్లీ విజృంభిస్తాయా అనే ప్రశ్నను లేవనెత్తారు. సంతృప్తికరమైన జవాబు మాత్రం రాలేదు. సమాధానాలు రానంత మాత్రాన ప్రశ్నల విలువలు తగ్గిపోవు. చరిత్రలో జవాబులకంటే ప్రశ్నలకే బలం ఎక్కువ. మనిషి అన్వేషణలన్నీ ప్రశ్నలతోనే మొదలయ్యాయి. మహామహా ఆవిష్కారాలన్నీ వాటితోనే సాధ్యమయ్యాయి. వస్తువులను, పరికరాలను సృష్టించుకుని మనుగడ సాగిస్తున్న మనుషులకు ప్రపంచ సృష్టికి కూడా ఎవరో కారణమై ఉంటారనే ప్రశ్న తట్టి.. జవాబుల కోసం సాగించిన చింతనాన్వేషణతోనే మతాలన్నీ ఊపిరులు పోసుకున్నాయి. ఒక పథకంతో, శ్రమతో చేసే వస్తు, పరికర సృష్టే మానవ జీవనసారం కాబట్టి ఈ చరాచర ప్రపంచమూ అటువంటి సృష్టిజనితమేనని మనిషి అనుకున్నాడు. కాబట్టి ప్రశ్నకున్న విశిష్ట పాధాన్యత నుంచి చూస్తే 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాద పోకడలు మళ్లీ విజృంభిస్తున్నాయా? అన్నది సందర్భోచితమైందిగానే తోస్తుంది. లోతుగా పరిశీలిస్తే ఆ ప్రశ్నకు సమాధానం అవుననే కొంతమేరకు చెప్పుకోవాల్సి వస్తుంది. ఆనాటి పోకడలు కొన్ని ఇప్పుడు స్పష్టంగా కనపడుతున్నాయి. ఇవి ఎంత బలపడితే అంతగా ప్రపంచం వెనుకడుగులు వేస్తున్నట్లుగా కచ్చితంగా భావించొచ్చు. 19వ శతాబ్దంలో సామ్రాజ్యవాదాన్ని అనుసరించిన దేశాలన్నీ జాతీయవాదంతోనే తమ ఆక్రమణలను, ఆధిపత్యాన్ని సమర్థించుకున్నాయి. తమ దేశమే అన్ని రంగాల్లోనూ ముందుండాలనే వాదననే ప్రచారాస్త్రంగా చేసుకుని ప్రజలను యుద్ధోన్ముఖంగా నడిపించాయి. మొదటి ప్రపంచయుద్ధం ఆ విధంగానే వచ్చింది. అగ్రస్థానం కోసం అన్ని నియమాలనూ కాలదన్నాయి. వెనుకబడిన దేశాల ప్రజలకు నాగరికతనూ ఆధునికతనూ సాంకేతిక%-%శాస్త్ర విజ్ఞానాన్నీ అందివ్వటానికే ఆక్రమణలూ ఆధిపత్యాలూ యుద్ధాలూ అవసరమని వాదించాయి. సామ్రాజ్యవాదం ప్రత్యక్ష ఆక్రమణ రూపంలోనే ఉండాల్సిన పనిలేదు. కీలుబొమ్మ ప్రభుత్వాలను పెట్టి కీలక నిర్ణయాలన్నీ గుప్పెట్లో పెట్టుకుని సంపదను తరలించుకుపోయే పరోక్ష సామ్రాజ్యవాదమూ ఉంటుంది. రెండిటిలోనూ జరిగేది ఒకటే. ముడిసరుకుల సరఫరా కేంద్రంగా ఆక్రమిత దేశాలను మార్చివేయటం, పారిశ్రామిక ఉత్పత్తులకు కొనుగోలు మార్కెట్లుగా దిగజార్చటం సామ్రాజ్యవాదంలో ప్రధానంగా ఉంటుంది. ఇప్పుడైతే కాలుష్యకారక పరిశ్రమలను పెద్దఎత్తున తరలిస్తున్నారు. అన్ని వ్యవస్థలనూ సామ్రాజ్యవాదం తన అవసరాలకు అనుగుణంగా మార్చివేస్తుంది. రాజకీయాలు మారిపోతాయి. పండే పంటలు మారిపోతాయి. చేసే ఉత్పత్తులు మారిపోతాయి. భూములపై హక్కులు మారిపోతాయి. పాతవర్గాలు పోతాయి. కొత్త వర్గాలు పుట్టుకొస్తాయి. ఇక రైల్వేలు, పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఆధునిక విద్యా సౌకర్యాలు.. శాంతిభద్రతల స్థాపన లాంటివన్నీ సామ్రాజ్యవాద అవసరాల్లో భాగంగా కొంతమేరకు వస్తాయి. సామ్రాజ్యవాదం అహంకారపూరిత జాతీయవాదం చాలా సందర్భాల్లో పెనవేసుకునే ఉంటాయి.

అమెరికా అగ్రస్థానంలో ఉండాలని పదేపదే వినిపిస్తున్న వాదనను పరిశీలిస్తే ఆ తరహా జాతీయవాదమే కనపడుతుంది. ఇతర దేశాల పట్ల అనుసరించాల్సిన మర్యాదలను విపరీత జాతీయవాదం పాటించదు. పన్నుల్లో అసంబద్ధత ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవటం ఆధునిక దౌత్యనీతి. ట్రంప్ హెచ్చరికలను చూస్తే ఆ దౌత్యనీతి ఛాయలు ఎక్కడా కనిపించవు. ఇంతపన్ను విధిస్తాం.. అంత పన్ను విధిస్తాం.. అనే ఏకపక్ష ప్రకటనలే మనం వింటున్నాం. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాలనీ, గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేస్తామనీ, పనామా కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామనీ చేసే ప్రకటనలు సామ్రాజ్యవాద కాలాన్ని గుర్తుకు తెస్తాయి. దౌత్యపద్ధతులను, ఒప్పందాలను ఖాతరు చేయకపోవటం సామ్రాజ్యవాదంలో ఒక ప్రధాన లక్షణంగా ఉండేది. పరస్పర అంగీకారాల ద్వారా ఏర్పడిన సంస్థలను తప్పుపట్టటం, వాటి నుంచి వైదొలగటం ఆనాటి పోకడల్లో భాగమే. ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచీ ప్రపంచ పర్యావరణ ఒప్పందం నుంచీ తప్పుకోవటాన్ని ఇంకోలా అర్థం చేసుకోలేం. దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం జరగాలనీ దిగుమతులు-ఎగుమతులపై పన్నులు కనీస స్థాయిలో ఉండాలనీ ఆర్థిక సంస్కరణల పేరిట వివిధ దేశాలకు నిర్దేశించిందీ అమెరికా పాలకులే. ఇప్పుడు దానికి భిన్నంగా 19వ శతాబ్దంలో చేసినట్లు అధిక పన్నులను విధించి చౌక ఉత్పత్తులతో తమకు పోటీదారులుగా మారిన దేశాలను కట్టడి చేయాలనీ చూస్తున్నారు. చైనాతో వ్యవహరిస్తున్న తీరే దీనికి నిదర్శనం. పారిశ్రామిక విప్లవం తర్వాత ఇప్పటి ధనిక దేశాలన్నీ ఆనాటి పోటీ దేశాల ఉత్పత్తులపై విపరీతంగా పన్నులు వేసి వినియోగదారులు వాటిని కొనకుండా చేశాయి. భారత-చైనా సంప్రదాయ ఉత్పత్తులను అలాగే దెబ్బతీశారు. అధికపన్నుల విధింపులనే 'టారిఫ్ వాల్స్'గా పిలుస్తారు. ట్రంప్ హెచ్చరికలు కూడా ఆ 'వాల్స్' లాంటివే. ట్రంప్ దూకుడు చూస్తుంటే ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి కూడా వైదొలగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

పర్యావరణ విధ్వంసం 19వ శతాబ్దంలో విపరీతంగా పెరిగింది. 1869-1914ల మధ్య కాలాన్ని సామ్రాజ్యవాదం ఉచ్ఛదశగా చరిత్రకారులు పరిగణిస్తారు. ఆ కాలంలో జరిగిన పర్యావరణ విధ్వంసంతో ఏ యుగాన్ని పోల్చలేం.

# కర్పూరి ఠాకూర్ అప్పట్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు: కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "దేశ వ్యాప్తంగా భాజపా అధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థి దశలోనే ఆయన అనేక పోరాటాలకు రూపకల్పన చేశారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారు. బిహార్ రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించిన ఆయన.. అప్పట్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. ఓబీసీల అభ్యున్నతి కోసం కర్పూరి ఠాకూర్ విశేషమైన సేవలు అందించారు. పార్టీలకు అతీతంగా జన నాయకుడిగా కర్పూరి ఠాకూర్ పేరు తెచ్చుకున్నారు" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# కేపీహెచ్‌బీలో ఖాళీ ప్లాట్లకు ముగిసిన వేలం.. గజం రూ.1.85లక్షలు

మొదటి పేజీ తరువాయి

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) పశ్చిమ డివిజన్ పరిధిలోని ఖాళీ ప్లాట్ల వేలంపాట శుక్రవారం సాయంత్రం ముగిసింది. చదరపు గజం ధర అత్యధికంగా రూ.1.85 లక్షలు.. అత్యల్పంగా రూ.1.50 లక్షలు పలికింది. కేపీహెచ్‌బీ పరిధిలోని 24 స్థలాల్లో 23 స్థలాలకు వేలంపాట ప్రక్రియ పూర్తయినట్టు అధికారులు తెలిపారు.కేపీహెచ్‌బీ పరిధిలోని ఖాళీ ప్లాట్ల వేలం పాట వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేపీహెచ్‌బీ ఫేజ్-15 కాలనీ వాసులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. 54.29 ఎకరాల స్థలంలో లేఅవుట్ ఉందని.. అందులో 10శాతం గ్రీనరీ కోసం వదిలేయాలి కదా అని వాదనల సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని కూడా ప్లాట్లుగా విక్రయిస్తున్నారా? అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 10 శాతం ఖాళీ స్థలాన్ని ఇప్పటికే జీహెచ్ఎంసీకి అప్పగించామని ఏజీ కోర్టుకు తెలిపారు.

కేపీహెచ్‌బీ.. ఆసియాలోనే అతిపెద్దది, పాత లేఅవుట్ కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేఅవుట్‌లో అక్కడక్కడా మిగిలిన ప్లాట్లను మాత్రమే వేలం వేస్తున్నట్లు ఏజీ తెలిపారు. అయితే, కేవలం 30 గజాల స్థలాన్ని ఎందుకు వేలం వేస్తున్నారని.. అది వ్యాపార అవసరాలకే ఉపయోగపడుతుంది కదా అని ఏజీని ప్రశ్నించింది. లేఅవుట్‌లో గ్రీనరీ కోసం కేటాయించిన 10శాతం భూమి వివరాలు ఇవ్వాలని ఏజీని ఆదేశించింది. తుది కేటాయింపులు చేయకూడదనే షరతుతో వేలంపాట కొనసాగించవచ్చని కోర్టు తెలిపింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ధర్మాసనం వచ్చే గురువారానికి వాయిదా వేసింది.

# బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు?: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

ఏపీ సీఎస్‌గా పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా పెట్టుకున్నారు. సలహాదారుగా పెట్టుకునేందుకు తెలంగాణ ప్రభుత్వానికి ఇంకెవ్వరూ దొరకలేదా? మూడు నెలలు జైలుశిక్ష పడిన ఏకైక అధికారి ఆదిత్యనాథ్‌దాస్. ఆయన విషయంలో రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లించారేమో అనిపిస్తోంది. తుంగభద్రలోనూ గండికొట్టేందుకు ఏపీ, కర్ణాటక యత్నిస్తున్నాయి. ఏపీ, కర్ణాటక తుంగభద్రకు గండికొడుతుంటే సీఎం ఎం చేస్తున్నారు? 2017లో ఏపీ ఇలాంటి ప్రయత్నం చేస్తే గట్టిగా అడ్డుకున్నాం. బనకచర్లపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. సెక్షన్ 3ని సాధించిందే భారాస పార్టీ. ఇప్పుడు సెక్షన్ 3పై ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్తే కనీసం కేవియట్ వేయరా?ప్రభుత్వాన్ని అధికారులు సరిగ్గా మార్గదర్శకత్వం చేయట్లేదు. మంచి అడ్వొకేట్లను పెట్టి సెక్షన్ 3 విషయంలో వాదించాలి" అని హరీశ్‌రావు అన్నారు.

# నల్గొండ జిల్లా మంత్రికి దోచుకోవడం, దాచుకోవడమే సరిపోతుంది.. జగదీశ్ రెడ్డి ఎద్దేవా

మొదటి పేజీ తరువాయి

రైతులు, ప్రజల్లో వ్యతిరేకతను అణిచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలే తిరగబడుతున్నారని.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీస్తున్నారని తెలిపారు. దీనికి గ్రామసభల్లోని ప్రజల అభిప్రాయాలే నిదర్శనమని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పోరాటాలకు సిద్ధపడిన ప్రజలకు నాయకత్వం వహించాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ పరిస్థితిల్లో తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు కోసమే కేసీఆర్, బీఆర్ఎస్ నిలబడుతున్నదని తెలిపారు. ప్రభుత్వం చేతిలో మోసపోయిన రైతాంగం తరఫున కేటీఆర్‌ను పిలిచి ఆందోళనకు సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. కరెంట్ కోతలు, ఎరువుల కొరత, రైతు బంధు, రుణమాఫీ కోసం రైతులు ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అందుకే క్లాక్ టవర్ లో ధర్నా కు సిద్ధమని అన్నారు. దీన్ని అడ్డుకోవాలని ప్రభుత్వం చూసినప్పటికీ న్యాయస్థానం తమకు అండగా నిలిచిందని తెలిపారు. కోర్టు అనుమతితో ఈ నెల 28 వ తేదీన 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి పోలీస్ యంత్రాంగం, అధికారులు సహకరిస్తారని ఆశిస్తున్నామని అన్నారు. నల్గొండ జిల్లా మంత్రికి దోచుకోవడం, దాచుకోవడమే సరిపోతుందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. రైతులను మోసం చేస్తూ మిలర్ల దగ్గర కమిషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా రైతులను వెయ్యి కోట్ల వరకు మోసం చేశారని అన్నారు. దీనిపై రైతులు, ప్రజలు ప్రశ్నిస్తుంటే దాడులు చేయిస్తున్నారని చెప్పారు. నల్గొండకు ఒక్క రూపాయి కొత్తగా తెచ్చింది లేదని విమర్శించారు. జిల్లా ప్రజలు దీన్ని గమనించాలని సూచించారు. జిల్లా మంత్రి చేస్తున్న మోసాలపై రైతులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. తుమ్మల నాగేశ్వర్ రావు.. మీకు ధైర్యం ఉంటే.. వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తే.. ఇప్పటి వరకు కొన్న ధాన్యం ఎంతనో చెల్లించిన బోనస్ ఎంతనో చెప్పాలని జగదీశ్ రెడ్డి సవాలు విసిరారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొన్నారో చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని ఎద్దేవా చేశారు. ఏ ముఖం పెట్టుకుని రైతుల విషయం మట్లాడుతున్నారో చెప్పాలని మండిపడ్డారు. రైతులను చూసి ఉచ్చ పోసుకుని పారిపోతున్నారని విమర్శించారు. ఆంధ్రా నుంచి కొట్లాడి కృష్ణా నీళ్లు తెచ్చి పారించిన ఘనత తమదని గుర్తుచేశారు. 40 లక్షల టన్నుల ధాన్యం పండించి నల్లగొండను అన్నపూర్ణగా మార్చిన ఘనత తమది అని అన్నారు. అందుకే ప్రజల్లోకి ధైర్యంగా వస్తున్నామని స్పష్టం చేశారు. గ్రామ సభల లిస్టులపై ప్రభుత్వం తిరోగమనం పట్టిందని జగదీశ్ రెడ్డి అన్నారు. ఇప్పటికే మూడు సార్లు దరఖాస్తు చేస్తే అవి ఎటూ పోయాయో కూడా తెలియదని అన్నారు. దరఖాస్తు ఫారాలు కూడా అమ్ముకునే దౌర్భాగ్యాలు మన కాంగ్రెస్ నేతలు అని ఎద్దేవా చేశారు. మళ్లీ దరఖాస్తులు ఎందుకు చెప్పాలని నిలదీశారు.

# తెలంగాణ సీఐడీ చేతికి 'కిడ్నీ రాకెట్' కేసు.. వైద్యారోగ్య శాఖ మంత్రి ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మరోవైపు ఈ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఆస్పత్రి ఛైర్మన్ సుమంత్, మరో వ్యక్తి గోపి సహా 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సుమంత్, గోపీని పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

గతంలో కిడ్నీ రాకెట్ కేసులో మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి ద్వారా కొందరి పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించారు. వీరంతా తమిళనాడు, కర్ణాటక నుంచి కిడ్నీ దాతలు, గ్రహీతల్ని తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అలకనంద ఆసుపత్రిలో కిడ్నీమార్పిడి శస్త్ర చికిత్సలు గతంలోనూ జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు కనీసం 15 నుంచి 20 మంది వైద్యులు, ఇతర సిబ్బంది అవసరమవుతారు. చికిత్స చేయడానికి వైద్యులతోపాటు ఆపరేషన్‌కు ముందు, తర్వాత ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లో నర్సులు, టెక్నీషియన్లు ఉండాలి. ఇంతమంది ఎక్కడి నుంచి వస్తున్నారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఈ ఆసుపత్రి 9 పడకలతో ప్రారంభమైందని, ఇందులో ఎలాంటి ప్రత్యేక వసతులు లేవని రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇచ్చారు.

# కొత్త కంపెనీల సంగతి దేవుడెరుగు.. ఉన్న కంపెనీలు పోకుండా చూడండి! : కేటీఆర్


మొదటి పేజీ తరువాయి

అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐటీ కంపెనీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటైన ఐటీ హబ్‌లకు రేవంత్ సర్కార్ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. అసలు ఆ హబ్‌లను పట్టించుకోవడం లేదు. దీంతో ఐటీ ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేటలోని ఐటీ హబ్‌కు ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నెట్ ప్రొవైడర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మినిస్టర్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు.

కొత్త కంపెనీల సంగతి దేవుడెరుగు.. ఉన్న కంపెనీలు పోకుండా చూడండి! అని కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. హైదరాబాద్ నగరం ఒక్కటే కాకుండా తెలంగాణలోని అన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా ఐటీ రంగాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో సుమారు ఎనిమిది ఐటీ హబ్‌లను ఏర్పాటు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని తెలిపారు. కానీ, కాంగ్రెస్ రాగానే మంచిగా నడుస్తున్న ఆ ఐటీ హబ్‌లు ఒక్కొక్కటిగా పట్టాలు తప్పుతున్నాయి. విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులు కూడా కట్టని దుస్థితికి చేరుకున్నాయి. ఫలితంగా కంపెనీలు మూతపడుతున్నాయి. గత ప్రభుత్వం మీద కోపంతో ఇలాంటి దుశ్చర్యలు మానండి. తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించే సదుద్దేశంతో నెలకొల్పిన ఈ ఐటీ హబ్‌లను సక్రమంగా నడపాలని కోరుతున్నాను అని కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు.

# కర్పూరి ఠాకూర్ జయంతి ఉత్సవాలు

ప్రభాకర్ మారేటి,
కరపత్రం ప్రతినిధి






కామారెడ్డి దేశ వ్యాప్తంగా కర్పూరి ఠాకూర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైద్రాబాద్ లోని బీజేపీ రాష్ట్ర ఆఫీస్‌లో ఠాకూర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని బీజేపీ-2025 డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. సోషలిస్టు నాయకుడిగా విద్యార్థి దశలోనే ఠాకూర్ అనేక పోరాటాలకు రూపకల్పన చేశారని అన్నారు. బిసి, నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కర్పూరి ఠాకూర్ 1952 లో తొలిసారి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా బీహార్ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కర్పూరి ఠాకూర్ బిసిల కొరకు అనేక పోరాటాలు చేసారు. కార్మిక వర్గ పక్షపాతిగా పిలువబడ్డాడు. ఎస్. ఎన్. మలకర్ లాంటి విద్యార్థి నాయకులను, చెట్ రాం తోమర్ లాంటి నేతలను ఎందరినో సృష్టించిన కర్పూరీ ఠాకూర్ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అనుచరుడిగా కీర్తించబడ్డాడు. బిహార్‌కు విద్యాశాఖ మంత్రిగా, 2 సార్లు బీహార్ ముఖ్యమంత్రిగా సేవలు అందించారని.. అప్పట్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దివంగత శ్రీ కర్పూరి ఠాకూర్ కు "భారత రత్న" అవార్డు కు ఎంపిక చేసింది. అదే నెలలో శ్రీ కర్పూరి ఠాకూర్ గారు జ్ఞాపకార్ధంగా కేంద్ర ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. బీహార్ ప్రజలచే "జన నాయక్" గా పిలువబడ్డ శ్రీ కర్పూరి ఠాకూర్ కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత రత్న అవార్డు ను 26 జనవరి 2024 రోజున భారత రాష్ట్రపతి గౌరవ ద్రౌపది ముర్ము గారు ప్రదానం చేసారు. ఆ మహనీయుని జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నదని కిషన్ రెడ్డి తెలియజేసారు.

# కోరుట్ల మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం

ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి



మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను దేవుళ్లతో అభివర్ణింస్తూ మున్సిపల్ కార్మికులైన జవాన్లు గంగాధర్, రాజేశ్, చెత్త సేకరణ బండి డ్రైవర్ రాజ్ కుమార్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ కర్ణాకర్, మహిళా కార్మికురాలు రాధ, జెసిబి డ్రైవర్ ఖలీల్, భగీరథ వాటర్ సప్లయర్ ముఖిం, ఆర్పీ మాధురి, అంగన్ వాడి టీచర్స్ హైమద, సాయి ఈశ్వరి, కోరుట్ల ఎలక్ట్రికల్ కరెంటు డిపార్ట్మెంట్ రాకేష్, రాము గార్లకు 22 వ వార్డు కౌన్సిలర్ బిజెపి ఫ్లోర్ లీడర్ మాడవేని నరేష్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మాడవేణి స్వప్న గార్లు పాదాలను పవిత్ర నదీ జలాలతో కడిగారు. నరేంద్ర మోడీ గారి బాటలో వీరందరికీ ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళా నుండి త్రివేణి సంగమ గంగా యమునా సరస్వతి నదుల జలాలతో వారి పాదాలు కడిగి నూతన వస్త్రాలు ఇవ్వడం జరిగింది. మరియు అమృత తీర్థ ప్రసాదాలు అందిస్తూ వీరందరినీ సన్మానించడం జరిగింది. ఇట్టి సందర్భంగా మాడవేని నరేష్ గారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 4 గంటలనుండి ప్రతి వార్డులో ఎంతో శ్రమిస్తూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతున్నారని మరియు ప్రతి ఒక్క డిపార్ట్మెంట్ కార్మికులు కష్టం వల్లనే ప్రతి వార్డ్ శుభ్రంగా ఉంటుందని కార్మికులను కొనియాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఇలాంటి గొప్ప కార్యక్రమం చేస్తున్న మాడవేని నరేష్ గారిని అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేస్తూ మున్సిపాలిటీ కార్మికుల్ని వారిని కుటుంబ సభ్యులుగా చూడాలని కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు సుదవేని మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చెట్లపెల్లి సాగర్, ఉపాధ్యక్షులు కంఠం ఉదయ్, ఎర్ర రాజేందర్, ఉరుమళ్ళ నరేష్, బిజెపి సీనియర్ నాయకులు చిరుమళ్ళ ధనుంజయ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి గోనెల రాజశేఖర్, గుండేటి సంజీవ్, రాగం శెట్టి సాయి కృష్ణ, రాహుల్, గుగ్గిళ్ళ అశోక్,మాడవేని సురేష్ మరియు మహిళ మోర్చానాయకురాల్లు గాలి లత, ముత్యాల లత, గడ్డం సంధ్య, బొమ్మెన విజయ్, దేశవిని రాజేష్, బింగి రాహుల్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజాలు నిర్భయంగా చెప్పేవే పత్రికలు

ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి



వాస్తవాలు రాసే పత్రికలకు ఎప్పుడూ మంచి గుర్తింపు లభిస్తుందని జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదురుగా అమరులైన జర్నలిస్టుల స్మారక స్తూపం నిర్మాణ పనులకు జువ్వాడి నర్సింగారావు భూమి పూజ చేశారు. ప్రస్తుతం ప్రపంచమంతా డిజిటల్ వైపే చూస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్, జిల్లా ప్రింట్ మీడియా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అంజు గౌడ్, సంతోష్ కుమార్, పాత్రికేయులు సలీం ఫారుకి, సాజిద్ అలీ, గురువంతుల నారాయణ, నవీన్, గజం శంకర్, మోబిన్, చిరంజీవి, లక్ష్మణ్, సాయి కృష్ణ, నవాబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, నాయకులు అన్నం అనిల్, మచ్చ కవిత, పలువురు కౌన్సిలర్లు, పాత్రికేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# మల్లాపూర్ గ్రామసభలో ప్రోటోకాల్ రగడ

**కరపత్రం జనవరి 24**

ఈరోజు మల్లాపూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభ ప్రోటోకాల్ విషయంలో రగడ జరిగింది ఇట్టి గ్రామసభకు ముఖ్యఅతిథిగా కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అలాగే కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి జువ్వాడి నరసింగరావు ఒకే వేదికను పాలుపంచుకున్నారు సభ ప్రారంభించిన కొద్దిసేపటికి ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫోటో లేదని బారాస నాయకులు వాగ్వాదానికి దిగారు ఫ్లెక్సీని చించివేసి నిరసనకు దిగారు ఈ సంఘటనతో ఇరు పార్టీల మధ్య వాగ్వాదం జరిగింది అలాగే బీఆర్ఎస్ నాయకులు నర్సింగరావు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు కాంగ్రెస్ నాయకులు కూడా ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు చివరికి పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగిన తర్వాత ఇద్దరు నాయకులు ఒకే వేదికపై కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధి మా ధ్యేయమని పేర్కొన్నారు ఇలాంటి పరిణామాన్ని చూసిన గ్రామస్తులు ఇది మా సమస్యల కోసం ఏర్పాటు చేసిన సభ లెక్క లేదని రాజకీయ నాయకుల వాగ్వాదానికి ఏర్పడిన సభలా ఉందని ముక్కున వేలేసుకున్నారు తర్వాత సభ యధావిధిగా కొనసాగింది

# నేత్ర, శరీర, అవయవ దానాలకు ముందుకు రండి


## - యువతకు సదాశయ పిలుపు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, జనవరి 24.**




మరణానంతరం కూడా మానవ శరీరాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చోడవరపు లింగమూర్తి సలహాదారు నూక రమేష్ అన్నారు. శుక్రవారం రామగుండం 3 డివిజన్ లోని మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో నేత్ర, శరీర, అవయవ దానాలపై శిక్షణార్థులకు అవగాహన కల్పించారు. మరణానంతరము నేత్రదానం వల్ల అంధులైన వారికి చూపు ప్రసాదించవచ్చుని, అవయవ దానం వల్ల మరికొందరికి పునర్జన్మ ప్రసాదించవచ్చుని, శరీర దానం వైద్య కళాశాల విద్యార్థుల విద్యాబోధనకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మరణాంతరం శరీరాలను ఖననం చేసినా, దహనం చేసినా ప్రయోజనం ఉండదని కనుక వాటిని సమాజ ప్రయోజనాల కోసం వైద్య కళాశాలలకు ఉపయోగించాలన్నారు. శిక్షణ పొందుతున్న 45 మంది యువ ఉద్యోగులు సదాశయ ఆశయానికి సంసిద్ధత ప్రకటించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు వారికి డోనర్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీటీసీ మేనేజర్ సుజిత్ శ్రీనివాస్ ఓవర్ మెన్లు నాగళ్లి సాంబయ్య, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి సమ్మయ్య పాల్గొన్నారు. నేత్ర అవయవ శరీర దానాలకు ముందుకు వచ్చిన యువకులను వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రవణ్ కుమార్, గౌరవాధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, సలహాదారు నూక రమేష్, ప్రచార కార్యదర్శి వాసు లైన్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి అభినందించారు.

# మాకు ప్రత్యేక గ్రామపంచాయతీ వద్దు...



## - గ్రామ సభల తీర్మానం....
## - తాజా మాజీ వైస్ ఎంపీపీ రమేష్...

**కరపత్రం శంకరపట్నం జనవరి 24**

మాకు ప్రత్యేక గ్రామపంచాయతీ వద్దు అంటూ ఎస్సీ కాలనీ వాసులు గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆవేదనను వ్యక్తం చేసి గ్రామ ప్రత్యేక అధికారి కి ఓ వినతి పత్రాన్ని అందజేసినట్లు శంకరపట్నం మండల పరిషత్ తాజా మాజీ వైస్ ఎంపీపీ పులికోట రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం గద్దపాక గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ, అంబేద్కర్ నగర్ గా నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేసి దళితుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని, ఈ కాలనీలో కేవలం దళిత వర్గానికి చెందిన వారమే మాత్రమే నివాసం ఉంటున్నామని మాకు అంబేద్కర్ నగర్ నూతన గ్రామపంచాయతీ వద్దు గద్దపాక గ్రామపంచాయతీలో ఉంటామని, గ్రామసభలో ఏకగ్రీవంగా నిర్మాణం చేసి, గ్రామ ప్రత్యేక అధికారి మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ కు వినతిపత్రం అందజేసినట్లు రమేష్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు....

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జనవరి 24 ...**





హుజూరాబాద్ పట్టణం పరిధిలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలు లో భాగంగా డ్రైవర్స్ డే సందర్భంగా హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యం లో రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయం లో జాగ్రత్త అవసరం అని మద్యం తాగి వాహనాలు నడపవద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్స్ ఆటో డ్రైవర్ల కు కూడా పూలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఎఎంఫ్ సమ్మయ్య,హెడ్ గార్డ్ రవీందర్, ఎస్టిఐ ఆర్ ఎస్ ఫణి, సాగర్,రమేష్, డిఎస్ రెడ్డి, ఎంవిరెడ్డి, సాయిచరణ్, ఐల్లయ్య,సుమంత్,విద్యార్థులు, ఉపాధ్యాయులు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి డ్రాక్స్ మారకద్రవ్యాలపై అవగాహన సదస్సు ........

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 24....**





కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల గ్రామంలో ప్రొఫెషనల్ ఎక్సైజ్ శాఖ పరిధిలో తనుగుల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో గంజాయి బైక్స్ మరకద్రవ్యాల నిర్మూలనకై ఆహ్వాన సదస్సు నిర్వహించడం జరిగినది ఇట్టి సదస్సులో జమ్మికుంట ఎక్సైజ్ సిఐ ఎం మాధవి లత . ఎస్సై సౌమ్య మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గంజాయి డ్రగ్స్ మారకద్రవ్యాల పట్ల అవగాహన కల్పించాలని యువతకు వివరించారు ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు జి. స్వర్ణమయి ఎక్సైజ్ సిబ్బంది ఐలయ్య. మహేష్. మౌనిక. రేణుక. ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అంగన్ వాడిలో బాలికల దినోత్సవం

**కరపత్రం రామగిరి ప్రతినిధి, జనవరి 24.**



రామగిరి మండలం వెంకట్రావు పల్లె అంగన్వాడి-1 సెంటర్ లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ పల్లె అనిత మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. చిన్నపిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. లబ్ధిదారులంతా ప్రతి ఇంటిలో ఒక మొక్క నాటాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ హేమలత పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో చిక్కుకోవద్దు

**కరపత్రం డెస్క్ జనవరి 24:**

'పెరుగుతున్న వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల వినియోగం ఆందోళనకరంగా ఉంది. రాబోయే రోజుల్లో ఇది కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులకు దారితీయొచ్చు' జెరోదా సహ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ హెచ్చరిక ఇది.

'పెరుగుతున్న వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల వినియోగం ఆందోళనకరంగా ఉంది. రాబోయే రోజుల్లో ఇది కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులకు దారితీయొచ్చు' జెరోదా సహ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ హెచ్చరిక ఇది. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ తమ అప్పుల గురించి ఆలోచించాల్సిన అవసరాన్ని ఈ మాటలు నొక్కిచెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్పుల ఊబిలో చిక్కుకోకుండా మనం ఏం చేయాలి అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### అవసరానికి రుణం తీసుకోవడం..

ఇస్తున్నారు కదా అని అప్పు చేయడం..ఈ రెండింటికీ ఎంతో తేడా ఉంది. మహమ్మారి తర్వాత చాలామంది భరించలేని స్థాయిలో అప్పులు తీసుకున్నారని నితిన్ కామత్ విశ్లేషించారు. దీనికి ప్రధాన కారణం ముందస్తు ఆమోదంతో రుణం ఇస్తున్నామని చెప్పే ఫిన్‌టెక్ యాప్‌లే. రూ.10వేల లోపు తక్షణమే అప్పు ఇస్తామంటూ.. పదే పదే వచ్చే సందేశాలు ఎంతోమందిని ఆకర్షిస్తున్నాయి. దీంతో వీటిని తీసుకున్న వారి సంఖ్య పెరిగింది. కానీ.. గత రెండు త్రైమాసికాల నుంచి బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల నివేదికలను పరిశీలిస్తే... రాబోయే రెండు, మూడు త్రైమాసికాల్లో ఇబ్బందికరమైన పరిస్థితులు కనిపించే అవకాశం ఉంది.

### అధిక వడ్డీని వదిలించుకోండి..

'అప్పులు ఉన్నప్పుడు మానసికంగా ఎంతో ఒత్తిడి ఉంటుంది. వ్యక్తిగత జీవితం, కుటుంబం, ఉద్యోగం.. ఇలా ప్రతి చోటా అది మీపై ప్రభావం చూపిస్తుంది' అని నితిన్ పేర్కొన్నారు. ముందుగా అధిక వడ్డీ వసూలు చేసే రుణాలను వదిలించుకునే ప్రయత్నం చేయండి. ఆ తర్వాతే మీ మిగులు మొత్తం నుంచి పెట్టుబడులు పెట్టండి అని సూచించారు. ఈ నేపథ్యంలో మనమూ ఒకసారి మన ఖర్చుల తీరు, రుణాల నిర్వహణ గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. మీ అప్పుల్లో అధిక వడ్డీ వసూలు చేస్తున్న వాటి జాబితాను సిద్ధం చేసుకోండి. వాటిని సాధ్యమైనంత త్వరగా తీర్చేసేందుకు ప్రయత్నించండి.

### క్రెడిట్ కార్డులతో..

క్రెడిట్ కార్డును తీసుకునే ముందే మీ ఆదాయం, ఖర్చులకు సంబంధించిన బడ్జెట్‌ను కలిగి ఉండటం చాలా అవసరం. బడ్జెట్‌ను సిద్ధం చేసుకుంటేనే క్రెడిట్ కార్డు బాకీని ఎప్పటికప్పుడు చెల్లించే వెసులుబాటు ఉంటుంది.

మీ ఖర్చు అలవాట్లకు సరిపోయే కార్డును ఎంచుకోండి. రాయితీలు అధికంగా ఇచ్చేదీ, వడ్డీ రేట్లు తక్కువగా, వార్షిక రుసుములు లేకుండా ఉన్న కార్డును తీసుకోవాలి.

చెల్లింపు తేదీలు, ఆలస్య రుసుము, మీ క్రెడిట్ పరిమితిని మించినప్పుడు విధించే జరిమానాలు తదితర నిబంధనలను తనిఖీ చేయాలి. మీ క్రెడిట్ కార్డును సమర్థంగా నిర్వహించడంలో ఇది సాయం చేస్తుంది.

బిల్లును మొత్తం చెల్లించాల్సిన అవసరం లేకుండా.. కనీస మొత్తం చెల్లించడం చాలామందికి సౌలభ్యంగా ఉంటుంది. కానీ, ఇలా చేయడం వల్ల మిగిలిన బాకీపై అధిక వడ్డీకి కారణం అవుతుంది. ఇది మీ అప్పును పెంచుతూ వెళ్తుంది. కాబట్టి, పూర్తి బిల్లును సకాలంలో చెల్లించడమే ఎప్పుడూ ఉత్తమం.

వ్యక్తిగత రుణాల విషయంలో..




వ్యక్తిగత రుణాలు తీసుకునే ముందు మీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడం చాలా అవసరం. మీ ఆదాయం, ఖర్చులు, ఇప్పటికే ఉన్న రుణాలను తీర్చే సామర్థ్యం పరిగణనలోకి తీసుకోండి.

ఎక్కువ రుణాలు తీసుకోవద్దు. మీ అవసరాలకు సరిపోయే రుణ మొత్తం ఒకే చోట తీసుకోవడం మేలు.

వ్యక్తిగత రుణాల పరిశీలనా రుసుము, వడ్డీ, ముందస్తు చెల్లింపు ఖర్చులవంటివి చూసుకోండి. రుణం కోసం దరఖాస్తు చేసేముందు మీ రుణ దరఖాస్తు తిరస్కరించకుండా ఉండాలంటే మంచి క్రెడిట్ స్కోరు ముఖ్యం.

తీసుకున్న రుణాన్ని ఎలా చెల్లిస్తారు.. దీనికి సరైన ప్రణాళిక ఉండాలి. అప్పుడే మీ ఆర్థిక పరిస్థితి దెబ్బతినదు.

# పెట్టుబడి డెట్‌నూ చూడండి

**కరపత్రం డెస్క్ జనవరి 24:**

సంప్రదాయ పెట్టుబడులతో పోలిస్తే కాస్త అధిక రాబడిని, వైవిధ్యాన్నీ కోరుకునే వారు మ్యూచువల్ ఫండ్ పథకాలపై దృష్టి సారిస్తున్నారు. దీనికి తగ్గట్టే ఫండ్ సంస్థలూ మదుపరుల అవసరాలకు తగ్గట్టు పథకాలను అందిస్తున్నాయి. ఇందులో డెట్ ఫండ్లనూ ప్రధానంగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ బాండ్లు, ట్రెజరీ బిల్లుల వంటి స్థిరాదాయ సాధనాల్లో ఇవి పెట్టుబడి పెడతాయి. ఈక్విటీ ఫండ్లతో పోలిస్తే వీటిలో తక్కువ రిస్కు ఉంటుంది. సంప్రదాయ పెట్టుబడిదారులకు ఇవి అనుకూలంగా ఉంటాయి.

ఇందులో

**లిక్విడ్ ఫండ్లు:** అధిక లిక్విడిటీతో ఉంటాయి. స్వల్పకాలం పాటు మదుపు చేయాలనుకున్నప్పుడు వీటిని పరిశీలించవచ్చు.

షార్ట్ టర్మ్, అల్ట్రా షార్ట్ టర్మ్: తక్కువ వ్యవధి ఉన్న పెట్టుబడులపై ఇది దృష్టి పెడుతుంది.

గిల్ట్ ఫండ్లు: ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడి పెట్టాలనుకున్నప్పుడు వీటిని ఎంచుకోవచ్చు. ఇవి సురక్షితం.

కార్పొరేట్ బాండ్ ఫండ్లు: ప్రాథమికంగా ఇవి కార్పొరేట్ బాండ్లలో మదుపు చేస్తాయి. కాస్త నష్టభయం ఉన్నప్పటికీ, రాబడీ మిగతా డెట్ ఫండ్లతో పోలిస్తే కాస్త అధికంగా ఉంటుంది.

### అత్యవసర నిధి కోసం..

ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియదు కాబట్టి, కనీసం 6 నెలల ఖర్చులకు సరిపడా సొమ్ము చేతిలో ఉండటం మంచిది. ఈ మొత్తాన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకునే అవకాశం ఉండాలి. ఈ డబ్బు రాబడిని సంపాదించేందుకు కాదు. కాబట్టి, అధిక హెచ్చుతగ్గులు ఉండే ఈక్విటీల్లో మదుపు చేయకూడదు. ఒకవేళ చేసినా అవసరం వచ్చినప్పుడు సూచీలు పడిపోతే షేర్లను అమ్మినప్పుడు నష్టాలు మిగులుతాయి. అందుకే, లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్లలాంటివి అత్యవసర నిధిని మదుపు చేసుకునేందుకు ఉపయోగపడతాయి. వీటిలో మంచి పథకాలను ఎంపిక చేసుకొని, మదుపు చేయాలి. డబ్బు కావాలనుకుంటే అమ్మిన తర్వాత రోజు ఖాతాలో జమ అవుతాయి. అత్యవసర నిధిని బ్యాంకు డిపాజిట్లలోనూ పెట్టుకోవచ్చు.

### రికరింగ్ డిపాజిట్‌లాగా...

డెట్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)ద్వారా మదుపు చేసే అవకాశమూ ఉంటుంది.



**పెట్టుబడులు అనగానే సహజంగానే ఈక్విటీలే గుర్తుకు వస్తాయి. స్టాక్ మార్కెట్లో తీవ్ర హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఇందులో మదుపు చేసేందుకు కాస్త ఆలోచిస్తున్నవారు.. తక్కువ నష్టభయం ఉండే డెట్ పథకాలను పరిశీలించవచ్చు. ఈక్విటీలతో పోలిస్తే ఇవి ప్రత్యేకం. కాస్త సురక్షితంగానూ ఉంటాయి. రాబడీ తక్కువగానే ఉంటుంది. దీర్ఘకాలంలో ఈక్విటీలు ద్రవ్యోల్బణాన్ని అధిగమించే రాబడినిస్తాయి. పెట్టుబడుల జాబితాలో ఈక్విటీలతోపాటు, కాస్త డెట్‌కూ చోటు కల్పిస్తే.. అధిక రాబడితోపాటు, సురక్షితంగానూ ఉండేలా చూసుకోవచ్చు.**

కనీసం రూ.500లతోనూ పలు మ్యూచువల్ ఫండ్ సంస్థలు డెట్ ఫండ్లలో సిప్ చేసేందుకు అనుమతినిస్తున్నాయి. ఈ విధానంలో మదుపు చేయడం ద్వారా మార్కెట్ హెచ్చుతగ్గుల సగటు ప్రయోజనం పొందేందుకు అవకాశం ఉంటుంది. స్వల్పకాలిక అవసరాలతో పాటు, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకూ దీన్ని ఎంచుకోవచ్చు. రికరింగ్ డిపాజిట్ తరహాలోనే వీటిని అనుకొని, పెట్టుబడులు పెట్టొచ్చు.

ప్రత్యామ్నాయంగా..

సంప్రదాయ పెట్టుబడులను ఇష్టపడేవారు.. నష్టభయాన్ని తట్టుకోలేని వారు ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ప్రత్యామ్నాయంగా వీటిని పరిశీలించవచ్చు. కాకపోతే డెట్ ఫండ్లు వడ్డీకి హామీ ఇవ్వలేవు. వీటిని పూర్తిగా బ్యాంకు ఎఫ్‌డీలతో పోల్చలేం. ఇందులో కొన్నిసార్లు నష్టభయం ఉంటుందని మర్చిపోవద్దు. దీనికి సిద్ధపడితేనే డెట్ ఫండ్లను ఎంచుకోవాలి.

## తల్లిదండ్రులు, అత్తమామలకు ఆరోగ్య బీమా రక్షణ



**కరపత్రం డెస్క్ జనవరి 24:**

పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చులపై సంసిద్ధంగా ఉండడానికి ఆరోగ్య బీమా చాలా కీలకం. ప్రస్తుతం ఆరోగ్య బీమా అవసరం అందరికీ ఉంది. ముఖ్యంగా, ఇది పెద్దలకు మరింత అవసరం. భారతీయ సంస్కృతిలో పెద్దలకు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. మానసిక, శారీరక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య బీమాను కొనుగోలు చేస్తుంటారు. తల్లిదండ్రులకు మాత్రమే కాకుండా అత్తమామలను కూడా కలుపుకుని ఆరోగ్య బీమా తీసుకోవడం వల్ల మొత్తం కుటుంబ ఆరోగ్య/ఆర్థిక భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. ముఖ్యంగా, కుటుంబ సభ్యుల్లో ఉన్న సీనియర్లను కలుపుకుని బీమా పాలసీ తీసుకునేటప్పుడు ఎలా వ్యవహరించాలి అనేది ఇక్కడ తెలుసుకుందాం.

### అందరికీ ఆరోగ్య బీమా

మీతో పాటు మీ జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు, అత్తమామలతో సహా గరిష్ఠంగా 10 మంది కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా కొనుగోలు చేయొచ్చు. బీమా ఉండడం వల్ల మొత్తం కుటుంబ సభ్యులు సంపూర్ణ ఆరోగ్య ప్రణాళిక ద్వారా రక్షణ పొందుతారు. పిల్లలు పెరిగే కొద్దీ వారికి వైద్య సంరక్షణ అవసరాలు ఎలా అవసరమో, వృద్ధులైన తల్లిదండ్రులు, అత్తమామలకు అంతకన్నా ఎక్కువ అవసరం. వీరు ఇప్పటికే అనేక ఆరోగ్య సమస్యల నుంచి సతమతమవుతుంటారు. కాబట్టి, వారి ఆరోగ్య రక్షణకు ఆరోగ్య బీమా ఎంతగానో ఉపయోగపడుతుంది. మీరు ఎంచుకున్న కవరేజ్ ఆధారంగా సెక్షన్ 80D కింద రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు పన్ను మినహాయింపు కూడా పొందొచ్చు.

### అనువైన ప్లాన్‌లు

తల్లిదండ్రులతో పాటు అత్తమామలను కవర్ చేయడానికి అనువైన ప్లాన్ ఏదో తెలుసుకోవడం చాలా అవసరం. భారత్‌లో కుటుంబాలకు సంబంధించిన విభిన్న అవసరాలను తీర్చడానికి అనేక రకాల ఆరోగ్య బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయి. వీరు ఆసుపత్రిలో చేరే సమయంలో వీరి వైద్య ఖర్చులు, డే కేర్ ట్రీట్‌మెంట్స్, అంబులెన్స్ సేవలు, డయాగ్నొస్టిక్స్ పరీక్షలు మొదలైన వాటిని కవర్ చేయడానికి బీమా పాలసీలు ఉన్నాయి. అందులో కీలకమైన ప్లాన్‌లు ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

క్రిటికల్ ఇల్‌నెస్ ఇన్సూరెన్స్ ప్లాన్: ఇది క్యాన్సర్, గుండెపోటు, స్ట్రోక్ వంటి వాటితో సహా ఏవైనా తీవ్రమైన అనారోగ్యాలు ఉన్నట్లు నిర్ధారణ అయినట్లయితే, అసలు వైద్య ఖర్చులతో సంబంధం లేకుండా క్రిటికల్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లు ఏకమొత్తాన్ని చెల్లిస్తాయి.

సీనియర్ సిటిజన్ హెల్త్ ఇన్సూరెన్స్: 60 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసు గల వ్యక్తుల కోసం దీన్ని రూపొందించారు. ఇది వయసు సంబంధిత వ్యాధులు, వైద్య పరిస్థితులను కవర్ చేస్తుంది.టాప్-అప్ ప్లాన్/సూపర్ టాప్-అప్: టాప్-అప్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్, మీ బీమా పాలసీలో సీనియర్లకు వారి బేస్ మెడిక్లెయిం పాలసీపై అదనపు వైద్య కవరేజీని అందిస్తుంది. వారి బేస్ పాలసీ కవర్ పూర్తిగా వినియోగించుకున్నాక, ఈ పాలసీ ఉపయోగపడుతుంది.

### ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్

అత్తమామలను కవర్ చేయడానికి ఫ్యామిలీ ఫ్లోటర్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ సరైన ఎంపిక. ఈ ప్లాన్ మీ జీవిత భాగస్వామి, పిల్లలు, మీపై ఆధారపడిన తల్లిదండ్రులు లేదా అత్తమామలతో సహా మొత్తం కుటుంబాన్ని ఒకే పాలసీ కింద కవర్ చేస్తుంది. ప్రతి కుటుంబ సభ్యుని కోసం వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలను కొనుగోలు చేయడం కంటే ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ సరసమైంది అని చెప్పొచ్చు. ఇది హాస్పిటలైజేషన్ ఖర్చులు, హాస్పిటలైజేషన్‌కు ముందు/తర్వాత ఖర్చులు, డే-కేర్ విధానాలు, మరిన్నింటి కోసం విస్తృతమైన కవరేజీని అందిస్తాయి. ఫ్యామిలి ఫ్లోటర్ బీమాతో మొత్తం కుటుంబాన్ని కవర్ చేసే ఒకే పాలసీతో, బీమా నిర్వహణ మరింత సరళంగా మారుతుంది.

### ఆరోగ్య బీమా ఎంత?

మీ తల్లిదండ్రుల, అత్తమామల వైద్య చరిత్ర, వయసు సంబంధిత వ్యాధుల ఖర్చులు అంచనా వేసి బీమా మొత్తాన్ని తీసుకోవాలి. సీనియర్ సిటిజన్లు ఎక్కువ ఆరోగ్య సమస్యలను కలిగి ఉంటారు. అలాగే, కుటుంబ సభ్యులందరి దీర్ఘకాలిక సంరక్షణ అవసరాలపై దృష్టి కేంద్రీకరించాలి. కాబట్టి, ఆరోగ్య బీమా ప్లాన్‌లో సీనియర్లు ఉన్నప్పుడు రూ.50 లక్షల వరకు వైద్య అవసరాలకు బీమా ఉండడం మేలు.

### ప్రీమియం ఎంత?

ప్రీమియం అనేది కుటుంబ సభ్యుల వయసు, వారి ఆరోగ్య పరిస్థితులు, ఎంచుకున్న నిర్దిష్ట ఆరోగ్య బీమా ప్లాన్ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు మీరు, జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లలతో సహా వృద్ధాప్య తల్లిదండ్రులు/అత్తమామలు ఎనిమిది మంది సభ్యుల కుటుంబానికి కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ నుంచి రూ.50 లక్షల ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకుంటే, వార్షిక ప్రీమియం సుమారుగా రూ.45-50 వేల వరకు అవుతుంది. అదే బీమా సంస్థ ద్వారా..మీకు, మీ భార్య, పిల్లల కోసం ఫ్లోటర్ ప్లాన్, పెద్దలకు వ్యక్తిగత పాలసీలు తీసుకున్నట్లైతే సుమారుగా రూ.80-85 వేల వరకు ప్రీమియం చెల్లించాల్సి రావచ్చు. అయితే, ప్రీమియంలు..పాలసీదారుల వయసు, ఎంచుకున్న ప్లాన్లపై ఆధారపడి మారతాయి.

### అధిక బీమా కవరేజ్‌తో ప్రయోజనం

ఎక్కువ బీమా కవరేజ్ ఉండడం వల్ల మీ కుటుంబ సభ్యుల ఆరోగ్య అవసరాలను బీమా సంస్థ చూసుకుంటుంది. అధిక మొత్తంతో కూడిన ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ కుటుంబ సభ్యులందరికీ తగినంత కవరేజీని అందిస్తుంది. ఈ ప్లాన్‌లు గది అద్దె పరిమితులు, అధునాతన చికిత్సల కోసం కవరేజ్, మరిన్ని డేకేర్ విధానాలు వంటి అదనపు ప్రయోజనాలతో వస్తాయి.

### తగిన జాగ్రత్తలు

వివిధ బీమా సంస్థల వ్యక్తిగత, ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలతో పాటు మీ ఉద్యోగ సంస్థ అందించే గ్రూప్ పాలసీలను కూడా సమీక్షించండి. ముందస్తు వ్యాధులపై వర్తించే వెయిటింగ్ పీరియడ్‌లను తనిఖీ చేయండి. ఎక్కువ వైద్య ఖర్చు మొత్తాన్ని సొంతంగా జేబు నుంచి ముందు భరించి తర్వాత రియింబర్స్ చేసుకోవడం అంటే ఆర్థికంగా చాలా కష్టం అవుతుంది. కాబట్టి, బీమా పాలసీలో సీనియర్లు ఉన్నప్పుడు నగదు రహిత క్లెయింలను అందించే బీమా పాలసీని తీసుకోవడానికి ప్రయత్నించాలి.

కొన్ని బీమా సంస్థలు ఎక్కువ నెట్‌వర్క్ ఆసుపత్రులను కలిగి ఉంటాయి.